క్లుప్తంగా

రైల్వే డబుల్‌లైన్ పనులను పరిశీలించి డీఆర్‌ఎం



ఉద్యోగులతో మాట్లాడుతున్న డీఆర్‌ఎం

డోన్ రూరల్ : మండల పరిధిలోని చిన్నమల్కాపురం గ్రామం వద్ద జరుగుతున్న రైల్వే డబుల్‌లైన్ పనులను బుధవారం రైల్వే డీఆర్‌ఎం మనీష్ ఆగర్వాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైల్వే అధికారులతో మాట్లాడారు. పనులు ఎంత వరకు వచ్చాయి... ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నాయా... తదితర విషయాలపై ఆరా తీశారు. పనులు త్వరగా పూర్తి చేయాలని, నాణ్యత పాటించాలని సూచించారు.

వివాహిత ఆత్మహత్య

బనగానపల్లె రూరల్: పట్టణంలోని పక్కీర్‌పేటలో నివాసం ఉంటున్న వివాహిత షేక్ పర్వీన్(30) కడుపు నొప్పి తాళలేక సూపర్‌వాస్మోల్ తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ వీరాంజనేయులు బుధవారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు షేక్ పర్వీన్‌కు శిరివెళ్లకు చెందిన వ్యక్తితో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. ఈ దంపతులకు ఒక కుమారుడు. భర్తతో ఉన్న మనస్పర్థల కారణంగా పదేళ్లుగా భర్తకు దూరంగా ఉంటూ బనగానపల్లెలో కూలీ పనులు చేసుకొని జీవిస్తోంది. ఆటో డ్రైవర్ గోపాల్‌తో సహజీవనం సాగిస్తోంది. కొన్నేళ్లుగా కడుపు నొప్పి బాధతున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం జీవితంపై విరక్తి చెంది సూపర్ వాస్మోల్ తాగింది. గమనించిన స్థానికులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే పరిస్థితి విషయంగా ఉండడంతో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలి సోదరుడు మహమ్మద్‌హుస్సేన్ ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

షేక్ జాఫ్రిన్‌కు గ్రూప్‌-1 ఉద్యోగం



మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న షేక్ జాఫ్రిన్, కుటుంబ సభ్యులు

బేతంచెర్ల: ఇండియన్ డెఫ్ టెన్నిస్ క్రీడాకారిణి షేక్ జాఫ్రిన్‌కు ప్రభుత్వం గ్రూప్‌-1 స్థాయి ఉద్యోగం కేటాయించింది. 2017, 2021 డెఫ్ ఒలింపిక్స్‌లో ఆమె కాంస్య పతకాలు ఆమె సాధించింది. జాతీయస్థాయి అవార్డు అందుకుంది. ఇటీవల షేక్ జాఫ్రిన్ కుటుంబ సభ్యులతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. జాతీయస్థాయిలో టెన్నిస్ క్రీడాకారిణిగా రాణిస్తూ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని భారతదేశానికి పతకాలు సాధించిన విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అప్పట్లో స్పందించిన సీఎం ఉద్యోగం, ఇంటి స్థలం కేటాయించాలని సీఎంఓ కార్యాలయానికి ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా షేక్ జాఫ్రిన్‌కు అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్‌లో డిప్యూటీ రిజిస్ట్రార్ ఉద్యోగం, కర్నూలు నగరంలో పది సెంట్ల స్థలం కేటాయించారు. దీంతో బుధవారం బేతంచర్లలోని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని షేక్ జాఫ్రిన్ కుటుంబం కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

భ్రూణ హత్యల నివారణకు పాటుపడాలి

డోన్ టౌన్ : సమాజంలో ఆడ పిల్లల నిష్పత్తి ఎదుగుదల కోసం భ్రూణ హత్యల నివారణ ప్రతి ఒక్కరూ పాటుపడాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ భారతి, సామాజిక కార్యకర్త, గర్భస్థ పిండ నిర్ధారణ పరీక్ష నివారణ కమిటీ సభ్యుడు మమ్మద్ రఫీ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం లింగ నిర్ధారణ చట్టం 1994 గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల గణాంకాల ప్రకారం ఆడ పిల్లల నిష్పత్తి తుగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేసారు. ఆడ పిల్లలను పుట్టనిద్దాం, బతకనిద్దాం అనే నినాదంతో ముందు కెళ్ళాలన్నారు.

వాహనాల తనిఖీ

డోన్ టౌన్ : ఆర్టీసీ,రవాణా శాఖల అధికారులు సంయుక్తంగా బుధవారం వాహనాల తనిఖీ చేశారు. ఆర్టీసీ డిపో మేనేజర్ శోభూషణ్, డోన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో జాతీయ రహదారి కర్నూలు రోడ్డులో తనిఖీలు చేపట్టారు. రోడ్డు నిబంధనలు పాటించని పది వాహనాలను సీజ్ చేసి రూ.51,615 జరిమానా విధించినట్లు వారు తెలిపారు. తనిఖీలు కొనసాగిస్తామని, నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలను శాశ్వతంగా సీజ్ చేస్తామని వారు హెచ్చరించారు.

ఎవరిదీ రిక్షా..!

డోన్ టౌన్ : పట్టణంలోని కొత్తబస్టాండ్ వైపు ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలోని కేవీఎస్ ఆసుపత్రి ప్రేమ్ చాయ్ టీ హోటల్ మధ్య ఖాళీ స్థలంలో పది రోజుల కిందట గుర్తు తెలియని వ్యక్తులు ఓ రిక్షాను వదిలి వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు. డోన్ పట్టణంలో రిక్షాలే లేవని, ఎవ్వరు... ఎందుకు వదిలి వెళ్లారనే చర్చ మొదలైంది. ఈ విషయం సోషల్ మీడియాలో చెక్కర్లు కొట్టడంతో స్పందించిన పట్టణ పోలీసులు అక్కడికి చేసుకుని రిక్షాను తనిఖీ చేసి పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు.



బేతంచెర్ల: గజలక్ష్మి అలంకారంలో అమ్మవారు



కోవెలకుంట్ల : లలితా దేవి అలంకారంలో వాసవీమాత



కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లె గీతా శ్రమంలో మహాలక్ష్మి అలంకరణలో



డోన్: అమ్మవారికి పట్టుచీర, పసుపు, కుంకుమ సమర్పిస్తున్న పోస్టుపసాద్ దంపతులు



ప్యాపిలి: గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారు

భక్తిశ్రద్ధలతో దసరా ఉత్సవాలు



డోన్ టౌన్ : శ్రీలక్ష్మీదేవి అలంకరణలో శ్రీవిజయవాడ కనకదుర్గమ్మ

దేవీ శరన్నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. డోన్, బనగానపల్లె నియోజకవర్గాలలో వివిధ రూపాల్లో కొలువైన అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లో అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కోవెలకుంట్ల పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో అమ్మవారు వాసవీమాత లలితాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణానికి చెందిన పెండేకంటి సుబ్రమణ్యం, విజయలక్ష్మి, రాంకుమార్, రాణి, నాగేంద్రప్రసాద్, వేదవతి దంపతులు పూజకు ఉభయదారులుగా వ్యవహరించారు. కొలిమిగుండ్ల మండలం, అంకిరెడ్డిపల్లెలోని గీతాశ్రమంలో రాజరాజేశ్వరి దేవి మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సంజామల మండల, నొస్సం గ్రామంలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి గజలక్ష్మి దేవి అలంకారంలో కొలువయ్యారు. మండల కేంద్రం అవుకులో వెలసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి బాల త్రిపుర సుందరి దేవీ అలంకరణలో దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలకు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మేడం ఆంజనేయులు దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. మండల కేంద్రం డోన్ పాతబస్టాండ్‌లో ఏర్పాటు చేసిన మంటపంలో కొలువైన అమ్మవారు శ్రీ లక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు పోస్టుపసాద్, చైతన్య దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టుచీర, పసుపు, కుంకుమ సమర్పించారు. విగ్రహం ఏర్పాటుకు రూ.80వేలు విరాళం అందజేసిన పోస్టుపసాద్ దంపతులను నిర్వాహకులతో పాటు భవానీ భక్తమండలి సభ్యులు ఘనంగా సత్కరించారు.

– సాక్షి నెట్‌వర్క్



సంజామల: గజలక్ష్మి దేవి అలంకారంలో అమ్మవారు

అమ్మవారికి ఎమ్మెల్యే కాటసాని ప్రత్యేక పూజలు



అవుకు అమ్మవారిశాలలో ఆర్యవైశ్యులతో కలిసి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

అవుకు: మండల కేంద్రం అవుకులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో కొలువైన అమ్మవారిని బుధవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దర్శించుకున్నారు. ముందుగా ఎమ్మెల్యేకు అర్చకులు హరికృష్ణ శాస్త్రి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, ఆర్యవైశ్యులతో కలిసి ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం అధ్యక్షులు మేడం ఆంజనేయులు, తాళేపల్లె నాగేంద్రకుమార్, సభ్యులు పాల్గొన్నారు.

బేతంచెర్ల : మండల పరిధిలో వెలసిన మద్దిలేటి లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో అమ్మవారు గజలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేదపండితులు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో 10వేల మూల మంత్ర జపహోమాదులు నిర్వహించారు. ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ సీతారామ చంద్రుడు, పాలక మండలి సభ్యులు స్వామి అమ్మవార్లకు పూజలు చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి బుగ్గన



అమ్మవారి శాలలో పూజలు చేస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

బేతంచెర్ల: పట్టణంలోని అమ్మవారిశాల్లో వెలసిన వాసవీమాతను దసరా శరన్నవరాత్రుల సందర్భంగా గురువారం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి దర్శించుకున్నారు. ఆర్య వైశ్య సంఘం నాయకులు కందగడ్డల మోహన్ రావు, గుండా గోపాలు, జయ చంద్రయ్య, శేషా మోహన్, శేఖరయ్య తదితరులు మంత్రిని పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. వాసవీ మాతకు ప్రత్యేక పూజల అనంతరం మంత్రి బుగ్గనను ఆర్యవైశ్యులు, యువజన సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆర్యవైశ్యులు, వాసవీ మహిళా మండలి మహిళలను మంత్రి బుగ్గన ఆప్యాయంగా పలకరించి, పట్టణంలో జరుగుతున్న అభివృద్ధిపై చర్చించారు. గోరుకల్లు రిజర్వాయర్ ద్వారా శుద్ధమైన నీరు అందజేస్తామని మంత్రి తెలిపారు.

మంత్రి బుగ్గనను సత్కరించిన గోర్లగుట్ట ఆటో డ్రైవర్లు

పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డిని గోర్లగుట్ట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్లు ఘనంగా సత్కరించారు. ఇటీవల వాహన మిత్ర పథకం అందించడంపై సంతోషం వ్యక్తం చేస్తూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, మంత్రి బుగ్గనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరక్టర్ ఖాజా, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి, గూని నాగరాజు,వెంకిరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి,పిట్టల జాకీర్, సలీం, ఖాజా, నాగేశ్వర్‌రెడ్డి, సూర్య, భాస్కర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బ్రహ్మం, నిరంజన్, నాగరాజు, కిరణ్, హరి, నక్కరవి, యాకోబ్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసుల్లో 7 మందికి జైలు శిక్ష

బేతంచెర్ల: మండల పరిధిలోని రుద్రవరం గ్రామంలో2014 సంవత్సరం జనవరి 8న జరిగిన హత్య కేసుల్లో 7 మందికి జైలు శిక్ష విధించినట్లు సీఐ ప్రియతం రెడ్డి బుధవారం తెలిపారు. సీఐ వివరాల మేరకు 2014 సంవత్సరంలో రుద్రవరం గ్రామానికి చెందిన మన్నెం స్వాములు (45)అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన తలారి పెద్ద మద్దిలేటి, చిన్నమద్దిలేటి, తిమ్మయ్య, చంద్ర, మద్దిలేటి, బోయ రామనాయుడు, మద్దిలేటి, నగేష్ కలిసి పొలం విషయంలో గొడవ పడి హత్య చేశారు. మృతుని కొడుకు సుధాకర్ ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ మహేశ్వర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కర్నూలు మొదటి తరగతి న్యాయమూర్తి ట్రయల్ జరిపి నేరం రుజువు కావడంతో ఈ కేసులో ముగ్గురికి 5సంవత్సరాల జైలు శిక్ష, రూ 11 వేల జరిమానా, నల్గురికి 3సంవత్సరాల జైలు శిక్ష, రూ. 4వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

హత్య యత్నం కేసులో 6 మందికి జైలు శిక్ష

మండలపరిధిలోని రుద్రవరం గ్రామానికి చెందిన 6 మందికి హత్యయత్నం కేసుల్లో జైలు శిక్ష పడినట్లు సీఐ ప్రియతం రెడ్డి బుధవారం తెలిపారు. సీఐ వివరాల మేరకు రుద్రవరం గ్రామానికి చెందిన 2014 జనవరి 8వ తేదీన బోయ తలారి నాగేష్‌తోపాటు కుటుంబ సభ్యులను పొలం సమస్య మనస్పర్ధలతో అదే గ్రామానికి చెందిన బోయ శ్రీరాములు, విక్రం, రవి, రంజిత్, తిక్క లక్ష్మిదేవి, మీసాల మద్దిలేటి కట్టెలు, రాళ్లతో గాయపరిచారు. బోయ తలారి నాగేష్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ శ్రీధర్ కేసున మోదు చేసి దర్యాప్తు చేశారు. బుధవారం కర్నూలు జిల్లా మొదటి తరగతి న్యాయమూర్తి విచారణలో నేరం రుజువు కావడంతో 5 మందికి 2 సంవత్సరాల జైలు శిక్ష, రూ. 2వేల జరిమానా, అదేవిధంగా ఒక్కరికి 2 సంవత్సరాల జైలు శిక్ష రూ. 4వేల జరిమానా విధించినట్లు సీఐ వెల్లడించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ప్రజాసంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, చల్లా కుటుంబ సభ్యులు

అవుకు: కులమతాలు, పార్టీలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తుందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే సీఎం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రాధాన్యనిస్తున్నారని, ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు నేరుగా అందజేస్తూ అండగా నిలుస్తున్నారన్నారు. మండల కేంద్రంలోని అవుకు-1 గ్రామ సచివాలయ పరిధిలో రెండవ రోజు బుధవారం ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేతలు కాటసాని ఓబుల రెడ్డి, చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, అవుకు సొసైటీ చైర్మన్ చల్లా విజయభాస్కర్ రెడ్డి, చల్లా రఘునాథ్ రెడ్డి, అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, నాయకులు దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాస రెడ్డి, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ముడియాల జయచంద్రారెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, చల్లా విక్రాంత్ రెడ్డి, అధికారులతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఎమ్మెల్యే కాటసాని, చల్లా కుటుంబ సభ్యులకు ఆయా కాలనీల ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే గడపగడపకూ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వృద్ధులను ఆప్యాయంగా పలుకరించిన ఎమ్మెల్యే... అవ్వా పింఛన్ సక్రమంగా అందుతుందా... వలంటీర్ ఇంటి వద్దనే ఇస్తున్నాడా అని ఆరా తీశారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో అవుకు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మందా గుర్రమ్మ, ఉమ్మడి కర్నూలు జిల్లాల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డి, నాయకులు కునుకుంట్ల రామన్న, కంపిలి నారాయణ, వేటూరి రమణ, సికిందర్, బత్తిని మద్దిలేటి గౌడ్, వెంకటేశ్వర్లు గౌడ్, వాయునంద గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకే మీ ముందుకు..

చల్లా కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే కాటసానికి ఆయా కాలనీల ప్రజలు వివిధ సమస్యలు విన్నవించారు. ఇళ్ల స్థలాలు కేటాయించాలని, గృహాలు మంజూరు చేయాలని, సీసీ రోడ్లు నిర్మించాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరగా నివేదికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కాటసాని మాట్లాడుతూ సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే మీ ముందుకు వచ్చామన్నారు. ప్రజల వద్దకే పాలన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా తాము మీ వద్దకు వచ్చామని, ప్రతి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తునామన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఏ ఒక్కపేద ప్రభుత్వ పథకాలకు దూరం కాకూడదనేది తమ లక్ష్యమని, అర్హత ఉండి కూడా పథకాలు అందని పేదలు ఉంటే తమ దృష్టికి తేవాలని, పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు కుట్ర రాజకీయాలను నమ్మొద్దని, ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని ఎమ్మెల్యే కాటసాని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోవెలకుంట్ల: పట్టణ శివారులో పేకాట ఆడుతు న్న ఆరుగురిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపారు. రైల్వేబ్రిడ్జి సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందటంతో దాడి చేసి రూ. 43,710, పేకముక్క లుస్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

దమ్ముంటే అభివృద్ధిపై బహిరంగ చర్చకు రండి

- టీడీపీ నాయకులకు సవాల్ విసిరిన మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్



వంద పడకల నూతన ప్రభుత్వాసుపత్రి వద్ద టీడీపీ నాయకులకు సెల్ఫీ ఛాలెంజ్ విసురుతున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్ : గత యాభై ఏళ్లలో డోన్ నియోజకవర్గ పరిధిలో జరగని అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం రెండున్నరేళ్లలోనే రూ.2,300 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టింది వాస్తవం కాదా అని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డిని సూటిగా ప్రశ్నించి నిలదీశారు. బుధవారం గుత్తి రోడ్డులోని రుద్రాక్ష గుట్ట ప్రాంతంలో పది ఎకరాల విస్తీర్ణంలో రూ.40 కోట్లతో నిర్మిస్తున్న వంద పడకల ప్రభుత్వాసుపత్రి నూతన భవనం వద్ద ఆయన ఫొటోదిగి నియోజకవర్గ అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని టీడీపీ నాయకులకు సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. ఈ సందర్భంగా సప్తశైల రాజేష్ మాట్లాడుతూ కర్నూలు జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వాసుపత్రికి ఏమాత్రం తీసిపోని విధంగా 24 మంది స్పెషలిస్టు డాక్టర్లతో ప్రతిరోజూ నిర్విరామంగా 24 గంటల పాటు వైద్యసేవలు అందించే విధంగా ఆసుపత్రిని మంత్రి బుగ్గన తీర్చిదిద్దుతున్నారన్నారు. మరో రెండు నెలల్లో ఆసుపత్రి భవనాలు పూర్తయితే బుగ్గన చేతుల మీదుగా ప్రారంభించి నియోజకవర్గ ప్రజలకు భవనాన్ని అంకితం చేస్తామన్నారు. ఇప్పటికే ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులను, అవసరాలను అంచనా వేసి గాజులదిన్నె ప్రాజెక్టు ద్వారా రూ.30లక్షలతో మంచినీటిని ఆసుపత్రికి అందించేందుకు పైపులైన్ ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఏపీ మోడల్, గురుకుల, కస్తూర్బా పాఠశాలతో పాటు హంద్రీనీవా కాల్వ దగ్గర టీడీపీ నాయకులు ఫొటోలు దిగి సెల్ఫీ ఛాలెంజ్ అంటూ అబద్ధాలను పదేపదే ప్రచారం చేస్తున్నారని రాజేష్ మండిపడ్డారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలోనే వైఎస్ నగర్, కోట్ల, ఆర్యవైశ్య, ఆటోనగర్ ఏర్పడిన విషయాన్ని కాదనే దమ్ము, ధైర్యం టీడీపీ నాయకులకు ఉందా అని రాజేష్ నిలదీశారు.

ప్రజారోగ్యానికి జగనన్న సురక్ష భరోసా



ఓపీ నమోదు చేసుకుంటున్న ప్రజలు



వృద్ధులకు కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న దృశ్యం



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి వెంకటరమణ

కోవెలకుంట్ల: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజారోగ్యానికి భరోసా కలుగుతోందని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని భీమునిపాడు గ్రామ సచివాలయ పరిధిలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కంపమల్ల, భీమునిపాడు గ్రామాలకు చెందిన 604 మంది ఓపీ నమోదు చేసుకున్నారు. కోవెలకుంట్ల సీహెచ్‌సీ, దొర్నిపాడు పీహెచ్‌సీ డాక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటలక్ష్మి, సోఫియా, నాగేంద్ర రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే కంటి సమస్యలతో బాధపడుతున్న 111 మందికి కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుష్పకుమారి, ఈఓపీఆర్‌డీ రాధిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీతాలక్ష్మి, కంపమల్ల సర్పంచ్ సోముల లోకేశ్వరరెడ్డి, భీమునిపాడు ఉప సర్పంచ్ వెంకటలక్ష్మమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు అనిల్‌కుమార్‌రెడ్డి, వీరారెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

అవుకు: మండల పరిధిలోని అన్నవరం పాఠశాల ఆవరణలో బుధవారం తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు వినోద్ కుమార్, ఇందిరా కళ్యాణి, కంటి వైద్యులు నవాజ్, గైనకాలజిస్ట్ ప్రశాంతి 410 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.హెల్త్ క్యాంప్‌ను సందర్శించిన సర్పంచ్ మాదిరెడ్డి సాయినాథ్ రెడ్డి వైద్యసేవలపై ఆరా తీశారు.

వైద్య శిబిరాన్ని సందర్శించిన జిల్లా వైద్యాధికారి

బనగానపల్లె : మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో బుధవారం ఎంపీడీఓ శివరామయ్య అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు శివశంకరుడు, సోహేల్‌బాబు, ఫిరోజ్, మంగ్యానాయక్, లలిత, శైలజ, ఎంపీహెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు 842 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెల్త్ క్యాంప్‌ను జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, కో ఆర్డినేటర్ జఫ్రుల్లా సందర్శించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మధు, బాలరాజు, గోపాల్, వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి: మండల పరిధిలోని నేరేడుచెర్ల గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. 502 మందికి వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు.వైద్యాధికారులు నితీశ్, నుస్రత్ ఉ జొహర, ఈఓఆర్డీ బాలకృష్ణుడు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో పేదలకు కార్పొరేట్ వైద్యం

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతుందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, జెడ్పీటీసీ శివలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు బుగ్గన కుమార్ రెడ్డి, గూని నాగరాజు అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముద్దవరంలో సర్పంచ్ తిమ్మయ్య, ఎంపీటీసీ మధు, ఈఓఆర్డీ వెంకట రంగనాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ, జెడ్పీటీసీ ప్రారంభించారు. రోగులకు మందులు, కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, నాయకులు కాంతారెడ్డి, తిమ్మగురుడు, తిమ్మరాజు, మునిస్వామి, మద్దిలేటి స్వామి, మాజీ ఎంపీటీసీ రామకృష్ణ పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి

డోన్ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం పేదలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపులు నిర్వహిస్తుందని, అందరూ తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఉంగరానిగుండ్ల గ్రామంలో ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జగన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ నిర్వహించారు. హెల్త్ క్యాంప్‌ను సందర్శించిన ఎంపీపీ ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యనిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామచంద్రుడు, ఎంపీటీసీ ఓబులేష్, డాక్టర్ రాంభూపాల్, అఖిల్, ఉంగారినిగుండ్ల సర్పంచ్ చిన్నమద్ది, సీసంగుంతల సర్పంచ్ సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.



నేరేడుచెర్లలో మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది



కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



మాట్లాడుతున్న ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి

నేడు కోవెలకుంట్లలో జగనన్న ఆరోగ్య సురక్ష

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలోని నాల్గవ గ్రామ సచివాలయ పరిధిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ ఈఓ గోపీనాథ్ తెలిపారు. వైద్య శిబిరంలో నలుగురు డాక్టర్లు ప్రజలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. గ్రామ సచివాలయ పరిధిలోని ఆయా కాలనీల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు అంకిరెడ్డిపల్లెలో..

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లె మెయిన్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. నలుగురు స్పెషలిస్టు డాక్టర్లు ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేయడంతోపాటు ఉచితంగా మందులు అందజేస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు కానాలలో

సంజామల:మండల పరిధిలోని కానాలలో గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగకుమార్ తెలిపారు. సచివాలయ ఆవరణలో నిర్వహించే హెల్త్ క్యాంప్‌లో వైద్య నిపుణులు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని, సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ప్రజలకు సూచించారు.

వ్యక్తిపై దాడి

డోన్ టౌన్: మండల పరిధిలోని లక్ష్మంపల్లె గ్రామానికి చెందిన చౌడప్పపై పట్టణానికి చెందిన మనోహర్ దారికాచి దాడి చేసి గాయపరచినట్లు పట్టణ పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మద్దిలేటి తెలిపారు. నిందితుడు మనోహర్... చౌడప్ప అన్న పోలుకల్లు కూతురిని వివాహం చేసుకున్నాడు. కొద్ది రోజుల క్రితం కాన్పుకు వచ్చిన భార్య విషయంపై మనోహర్ మామతో గొడవ పడుతుండగా వరుసకు చిన్న మామ అయిన చౌడప్ప సర్దుకుపోవాలని సూచించాడు. రెండు రోజుల క్రితం డోన్‌లో పనులు ముగించుకుని గ్రామానికి భార్యతో కలిసి మోటార్ సైకిల్‌పై వెళ్తున్న చౌడప్పను పెద్దమ్మ దేవాలయం వద్ద మనోహర్ అడ్డగించి బండి గుజ్జుతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. చికిత్సల అనంతరం బుధవారం చౌడప్ప పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకునిని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.